సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 27 । జనవరి । 2023



గిరిజనాభివృద్ధే ధ్యేయం

గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా కృషి చేస్తున్నామని ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అన్నారు. గురువారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఆయన మాట్లాడారు. 8లో▸



పోటెత్తిన భక్తజనం

నాగోబా జాతరకు భక్తులు పోటెత్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. సెలవు రోజు కావడంతో భక్తుల సంఖ్య పెరిగింది. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0 /15.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వాయువ్యం దిశగా చలిగాలులు వీస్తాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉంది.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



జాతీయ జెండాతో విద్యార్థిని



వందనం చేస్తున్న కలెక్టర్ భారతి, ఎంపీ వెంకటేష్‌నేత, ఎమ్మెల్యే దివాకర్‌రావు



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న కలెక్టర్ భారతిహోళ్లికేరి



జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థినులు

- కలెక్టర్ భారతిహోళ్లికేరి
- సాదాసీదాగా గణతంత్ర వేడుకలు

పాతమంచిర్యాల: ప్రజాస్వామ్యం, అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ భారతిహోళ్లికేరి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం సమర్పించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మనది ప్రజాస్వామ్య దేశమని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి, దేశాభివృద్ధికి అందరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మధుసూదన్ నాయక్, డీసీపీ అఖిల్‌మహాజన్, పెద్దపల్లి ఎంపీ వెంకటేష్‌నేత, మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్‌చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్, డీపీఆర్వో సంపత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. కాగా, గణతంత్ర వేడుకలను సాదాసీదాగా నిర్వహించారు. ఎలాంటి హంగుఆర్భాటాలు లేకుండా జెండావిష్కరణ కార్యక్రమంతో సరిపెట్టారు. గతంలో వేడుకలను మంచిర్యాల బారుల ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించేవారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల శకటాల ప్రదర్శన, ఉత్తమ ఉద్యోగులకు అవార్డుల పంపిణీ, పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉండేవి. ఈసారి అవేవీ లేకుండా గణతంత్ర దినోత్సవం నిర్వహించారు.

న్యూస్‌రీల్

జాతీయ జెండాకు అవమానం



జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే

పాతమంచిర్యాల: జాతీయ జెండాకు అవమానం జరిగింది. స్వయంగా ఎమ్మెల్యేనే జెండాను తలకిందులుగా ఎగురవేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు గురువారం తన క్యాంపు కార్యాలయంలో జెండావిష్కరణకు హాజరయ్యారు. జెండాను తలకిందులుగా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పెద్దపల్లి ఎంపీ వెంకటేష్‌నేత, ఇతర నాయకులు సెల్యూట్ చేశారు. వెంటనే గుర్తించి జాతీయ జెండాను సరిచేసి ఎగురవేశారు.

టీచర్లు మెడికల్ సర్టిఫికెట్ తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: బదిలీలు, పదోన్నతులకు ప్రిఫరెన్షియల్ కేటగిరీ పాయింట్ల కోసం పలు రకాల వ్యాధులు ఉపాధ్యాయులు, వారి భార్య కలిగి ఉంటే మెడికల్ సర్టిఫికెట్ తీసుకోవాలని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ నెల 27 నుంచి 30వరకు డిస్ట్రిక్ స్పెషల్ మెడికల్ బోర్డు (మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రి) నుంచి పొందాలని పేర్కొన్నారు. క్యాన్సర్, ఓపెన్‌హార్ట్ సర్జరీ, న్యూరో సర్జరీ, బోన్ టీబీ, కిడ్నీ, లివర్, హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్, కిడ్నీ డయాలసిస్, పిల్లలు మెంటల్లీ రిటైర్డు, లుకేమియా, బ్లడ్‌క్యాన్సర్, తలసేమియా, మస్క్యులర్, డైస్ట్రోఫో, గుండెలో పుట్టుకు నుంచి రంధ్రం ఉన్నవారు, డయాబెటిస్ వ్యాధితో బాధపడుతుటే సర్టిఫికెట్లు అందజేయాలని తెలిపారు. సంబంధిత ఉపాధ్యాయులు, తమ పిల్లల రిపోర్టులతో మెడికల్ బోర్డులో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు హాజరు కావాలని సూచించారు.

కృత్రిమ గర్భధారణతో మేలురకం పశువులు

వేమనపల్లి: కృత్రిమ గర్భధారణతో మేలు జాతి పశువులను ఉత్పత్తి చేయవచ్చని ఉమ్మడి జిల్లా పశుగణాభివృద్ధి సహాయ సంచాలకులు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని సూరారం గ్రామంలో కృత్రిమ గర్భధారణపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పశువులు ఎదకు వచ్చిన సమయంలో గోపాలమిత్రలను సంప్రదించి మేలు జాతి పశువుల వీర్యాన్ని ఉపయోగించి గర్భధారణ చేయించాలని తెలిపారు. పాడి రైతులకు పశువుల పెంపకం, వ్యాధుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి చందన్‌కుమార్, సర్పంచ్ రమేష్‌గౌడ్, గణపతి, గోపాలమిత్రలు శ్రీకాంత్, రవీందర్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత ఎస్టీపీపీ-1



విజేత జట్టుకు ట్రోఫీ అందజేత

జైపూర్: మండల కేంద్రంలోని ఎస్టీపీపీలో నిర్వహించిన ఎస్టీపీపీ క్రికెట్ లీగ్-2023 పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈ నెల 18న పోటీలు ప్రారంభం కాగా సింగరేణి, పవర్‌మేక్ కంపెనీలతోపాటు పలు కంపెనీలకు చెందిన పది జట్లుగా ఉద్యోగులు పోటీల్లో తలపడ్డారు. గురువారం ఎస్టీపీపీ-1, పీఎంపీఎల్-2 జట్ల మధ్య ఫైనల్ పోటీలు జరిగాయి. ఎస్టీపీపీ-1 జట్టు విజేతగా, పీఎంపీఎల్-2 జట్టు రన్నర్‌గా నిలిచాయి. ఆయా జట్లకు ఎస్టీపీపీ సీటీసీ సంజయ్‌కుమార్ సూర్ ట్రోఫీలు ప్రదానం చేశా రు. మ్యాన్‌ఆఫ్‌ద సిరీస్ విజయ్, ఉత్తమ బౌలర్‌గా విష్ణువర్ధన్‌రెడ్డి, ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా సా యిప్రసాద్ బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఎంవోఏఐ కేంద్ర ఉపాధ్యక్షు డు సముద్రాల శ్రీనివాస్, పవర్ మేక్ ఇంచార్జీ అఖిల్‌కపూర్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పదోన్నతులు, బదిలీల చర్యలపై పరిశీలన

మంచిర్యాలఅర్బన్: డీఈవో కార్యాలయంలో గురువారం ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలపై చేపట్టిన ముందుస్తు చర్యలపై విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్(టెక్స్‌బుక్, పబ్లిక్ లైబ్రరీయన్) శ్రీనివాసచారి పరిశీలించారు. ఉపాధ్యాయులు పొందే పదోన్నతులు, బదిలీలు, ఉపాధ్యాయ ఖాళీలు తదితర విషయాలపై డీఈవో వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తగా ప్రక్రియంతా సాగాలని సూచించారు.

విధుల్లో నిక్కచ్చి.. ప్రజల్లో పేరు..!

- నూతన సీపీ, డీసీపీ ట్రాక్ రికార్డులు భేష్
- రామగుండం సీపీగా రెమా రాజేశ్వరి
- మంచిర్యాల డీసీపీగా సుధీర్ రామ్‌నాథ్ కేకన్
- ఇక్కడ పని చేసిన అఖిల్ మహాజన్‌పై ప్రశంసలు

బయోడేటా



పేరు: రెమా రాజేశ్వరి
స్వస్థలం: మున్నార్, కేరళ
(మున్నార్ నుంచి తొలి మహిళా ఐపీఎస్)
విద్య: పీజీ కంప్యూటర్ సైన్స్, పీజీ పోలీస్ మేనేజ్‌మెంట్ (ఓయూ), డిప్లమా ఇన్ హ్యూమన్‌రైట్స్, ఇతర
ఐపీఎస్ బ్యాచ్ : 2009
తొలి పోస్టింగ్ : ఏఎస్పీ జగిత్యాల

బయోడేటా



పేరు: సుధీర్ రామ్‌నాథ్ కేకన్
స్వస్థలం: మహారాష్ట్ర
విద్య: బీటెక్, ఐటీ
ఐపీఎస్ బ్యాచ్: 2019
ప్రొబేషనరీ కాలం: భూపాలపల్లి
తర్వాత ములుగు ఏఎస్పీగా బాధ్యతలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కొత్తగా రామగుండం పోలీసు కమిషనర్‌గా నియామకం అయిన రెమా రాజేశ్వరి, మంచిర్యాల డీసీపీగా నియామకం అయిన సుధీర్ రామ్‌నాథ్ కేకన్ విధుల్లో తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఒకరు సీనియర్ ఐపీఎస్ అధికారి కాగా, మరొకరు డీసీపీగా బాధ్యతలు చేపట్టినవారు. వీరిద్దరూ తమ వ్యక్తిగతంగా, ఉద్యోగ రీత్యా ప్రత్యేకత కలిగి ఉన్నారు. పారిశ్రామిక ప్రాంతంగా ఉన్న మంచిర్యాల జిల్లా పరిధిలో సింగరేణి, పరిశ్రమలు, గిరిజన, మహారాష్ట్ర సరిహద్దుతో మావోయిస్టు ప్రభావిత, శాంతిభద్రతలు, నేరాల నియంత్రణలో పకడ్బందీగా వ్యవహరించాల్సి ఉంది. మితిమీరుతున్న రాజకీయ జోక్యాన్ని తట్టుకుంటూ వచ్చే ఎన్నికల్లోనూ ప్రశాంత ఓటింగ్ కోసం కృషి చేయాల్సి ఉంది. ఈ క్రమంలో కొత్త అధికారులకు అనేక సవాళ్లు ఉన్నాయి.

రెమా రాజేశ్వరికి ప్రత్యేక గుర్తింపు..

రామగుండం పోలీసు కమిషనర్‌గా నియమితులైన రెమా రాజేశ్వరి విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరిస్తారనే పేరుంది. ఇటీవల సంచలనం సృష్టించిన నలుగురు టీఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసు దర్యాప్తు బృందంలో ఒకరిగా ఉన్న ఆమె, ప్రస్తుతం నల్లగొండ జిల్లా ఎస్పీగా ఉన్నారు. 2014 నల్లగొండ జిల్లా పెదవూర మండలం ఏనెమీదితండాలో 12 మంది గిరిజన బాలికలపై లైంగిక దాడి కేసు సమయంలో అడిషనల్ ఎస్పీగా ఉన్నారు. మొదట ఉమ్మడి రాష్ట్రంలో విశాఖపట్నం జిల్లాలో గ్రేహౌండ్స్ శిక్షణ ఎస్పీగా, జగిత్యాల ఏఎస్పీగా, ఆ తర్వాత మల్కాజ్‌గిరి డీసీపీగా, రెండుసార్లు మహబూబ్‌నగర్ ఎస్పీగా, రంగారెడ్డి, గద్వాల, ఖమ్మం జిల్లాల్లో ఎస్పీగా పనిచేశారు. మహబూబ్‌నగర్‌లో 17 మందిని పొట్టనబెట్టుకున్న సీరియల్ కిల్లర్‌ను పట్టించి కటకటాల పాలు చేశారు. అదే జిల్లాలో 12మందిని హత్య చేసిన మరో సీరియల్ కిల్లర్ ఆటకట్టించారు. సైబరాబాద్ పరిధిలో డీసీపీగా ఉన్నప్పుడు కూడా కీలక కేసుల దర్యాప్తు చేసి, ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు.

అసత్యపు వార్తలపై దృష్టి

వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ట్విట్టర్ తదితర సామాజిక మాధ్యమాల్లో తప్పుడు వార్తలు, అసత్య ప్రచారాలపై ఆమె ప్రత్యేక దృష్టి సారించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో పని చేసే సమయంలో కళాజాత బృందాలతో ప్రజల్లో తప్పుడు వార్తలపై అవగాహన కల్పించారు. మహిళ, బాలికలపై జరిగే నేరాలు, సామాజిక రుగ్మతలపై విశేషంగా కృషి చేస్తున్నారు.

సేవల్లో భేష్ సుధీర్

జీవితంలో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి అధిరోహించిన సుధీర్ రామ్‌నాథ్ కేకన్ 2019బ్యాచ్ ఐపీఎస్. ఆయన తొలిపోస్టింగ్‌లోనే ఉన్నతాధికారుల మన్ననలు పొందారు. ములుగు జిల్లా ఏటూరునాగారం పరిధిలో నక్సల్స్ ప్రభావిత కార్యకలాపాల అదుపులో కీలకంగా పని చేశారు. స్థానిక గిరిజనులతో మమేకమై అనేక క్యాంపులు ఏర్పాటు చేసి సేవ కార్యక్రమాలు చేశారు. ములుగు ఏఎస్పీగా భారీ వర్షాలతో రోడ్డుకు అడ్డంగా ఓ చెట్టుపడిపోతే తానే స్వయంగా గొడ్డలితో నరికి, అడ్డు తొలగించారు. ములుగు ఏఎస్పీగా ఉన్న ఆయనను మంచిర్యాల డీసీపీగా నియమించారు.

ప్రజల మన్ననలు పొందిన అఖిల్



మంచిర్యాల ఏసీపీగా అఖిల్ మహాజన్ బాధ్యతలు స్వీకరించి, ఆపై రామగుండం కమిషనరేట్ డీసీపీ(అడ్మిన్)గా, గ్రేహౌండ్స్ కమాండర్, ఇన్చార్జీ డీసీపీగా జిల్లాలో పని చేశారు. ఏసీపీగా ఉన్న సమయంలో కరోనా విపత్కర పరిస్థితులు, లాక్‌డౌన్ తదితర వరదల సమయంలోనూ అంకితభావంతో డ్యూటీ చేసి ప్రజల మన్ననలు పొందారు. ఆ తర్వాత డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి బదిలీపై వెళ్లిన తర్వాత జిల్లాకు ఇన్చార్జీ డీసీపీగా కొనసాగుతూ అక్రమ దందాలపై ఉక్కు పాదం మోపారు. ట్రాఫిక్ నియంత్రణ, నేరాలు, హత్యలు, దొంగతనాల అదుపునకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రౌడీ షీటర్లు, అక్రమ భూ దందాలు, చేసేవారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళ భద్రత, షీ టీం బాధ్యతలు నిర్వర్తించారు. ఫిర్యాదుదారులు ఎవరైనా సాయం కోసం వస్తే వెంటనే అప్రమత్తమై సేవలు అందించారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఎప్పుడైనా తనను కలిసే అవకాశం కల్పించారు. జిల్లాలో మారుమూల, వామపక్ష ప్రాంతాలకు వరకు చొచ్చుకుపోయి ఉత్తమ పోలీసింగ్ సేవలు అందించారు.

సాగునీటి కోసం రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న నాయకులు, రైతులు

దండేపల్లి: యాసంగి పంటలకు సాగునీరు అందించాలని మండలంలోని ముత్యంపేట వద్ద బీజేపీ, వైఎస్ఆర్‌టీపీ నాయకులు రైతులతో కలిసి గురువారం రాస్తారోకో నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ గూడెం ఎత్తిపోతల పథకం, పైపలైన్ లీకేజీలతోపాటు మోటార్లు నడవక నీటి సరఫరా నిలిచిందని, ఎత్తిపోతల కింద సాగు చేసిన పంటలకు నీరందక ఎండిపోతున్నాయని అన్నారు. కడెం ప్రాజెక్టు నుంచి డీ-28వరకు సక్రమంగా సాగునీరందడం లేదన్నారు. ఎత్తిపోతల పథకం మరమ్మతులు పూర్తయ్యేలోగా, కడెం ప్రాజెక్టు నీటిని అందించి పంటలు ఎండిపోకుండా చూడాలని అన్నారు. గూడెం లిఫ్ట్ మరమ్మతులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. బీజేపీ నాయకులు రాజయ్య, శేఖర్, శ్రీనివాస్, నరేష్, మల్లేశ్, వైఎస్ఆర్‌టీపీ నా యకుడు సురేందర్, రైతులు పాల్గొన్నారు. కాగా, ల క్సెట్టిపేట సీఐ కరీముల్లా ఖాన్, ఎస్సై సాంబమూర్తి, ఇరిగేషన్ అధికారులు రాజేందర్, శ్రీధర్, జాకీర్, ఎంపీపీ శ్రీనివాస్ మరమ్మతులు త్వరలో పూర్తి చేసి నీళ్లు అందిస్తామని చెప్పడంతో కొందరు వెళ్లిపోయారు. ఇంకా కొందరు నాయకులు, రైతులు అధికారులు వెళ్లిన కొద్దిసేపటికి రోడ్డుపై బైఠాయించారు.

స్పౌజ్‌ల బదిలీలకు ఓకే..!

- మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలకు ఎంట్రీ
- ఇతర జిల్లాలకు ఐదుగురు బదిలీ
- ఆసిఫాబాద్ నుంచి మంచిర్యాలకు 9మంది ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: స్పౌజ్‌ల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దంపతులను ఒకే చోటుకు బదిలీచేయాలని నిర్ణయించింది. గతంలో నిలిపివేసిన (బ్లాక్ చేసిన) 12 జిల్లాలకు దంపతుల బదిలీలు చేయాలని నిర్ణయించింది. మంచిర్యాల జిల్లాకు చెందిన ఐదుగురు ఉపాధ్యాయులు ఇతర జిల్లాలకు వెళ్లగా, కుమరంభీం జిల్లా నుంచి 9 మంది మంచిర్యాలకు బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. మంచిర్యాల నుంచి సిద్దిపేట, కరీంనగర్‌కు ఒకరి చొప్పున ఆదిలాబాద్‌కు ముగ్గురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లనున్నారు. గతేడాది జనవరిలో స్పౌజ్ టీచర్ల వినతులను పరిష్కరించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో జిల్లా విద్యా శాఖ అంగీకారం, అనంగీకరపత్రాల స్వీకరణ చేపట్టింది. భా ర్యాభర్తలు కోరుకున్నా(ఒకే) చోటుకు బదిలీ చేసేందుకు వచ్చిన వినతులు పరిష్కరించాలని సుముఖత వ్యక్తం చేసినా ఉమ్మడి జిల్లాలో మంచిర్యాల, ఆదిలా బాద్(ఇన్‌కమింగ్) బ్లాక్‌లిస్టు జాబితాలో చేర్చడం మింగుడుపడని సమస్యలా మారింది. ఈ రెండు జి ల్లాల నుంచి ఇతర జిల్లాలకు వెళ్లేందుకు అనుమతి వ్వడం.. ఇక్కడకు వద్దామనుకున్నా ఉపాధ్యాయులకు చుక్కెదురైంది. పరస్పర బదిలీలపై స్పష్టత లేకపోవడం.. స్పౌజ్ కేసులో అవకాశం కల్పించినట్లే క ల్పించి.. తిరకాసులు పెట్టడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు తప్పుబట్టాయి. బ్లాక్ లిస్టులో చేర్చిన మంచి ర్యాల జిల్లాకు వచ్చేందుకు స్పౌజ్ కేటగిరీ కింద అప్పట్లో 97 మంది దరఖాస్తులు చేసుకున్నారు. తీ రా చూస్తే మాత్రం మీకు ఈ జిల్లాకు నోఎంట్రీ చెప్పడంతో గందరగోళంలో పడ్డారు. స్పౌజ్‌లో(భార్య, భర్తలు) ఎవరైనా ఇతర జిల్లాలో పనిచేస్తే అక్కడికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నారా.. చెప్పండంటూ అంగీకారం.. అనంగీకారం పత్రాల సమర్పించాలని షరతులు విధించింది.

ఊరట..

మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలో స్పౌజ్‌లకు నోఎంట్రీతో ఇబ్బందులు పడ్డారు. మంచిర్యాలలో భార్య, ఆదిలాబాద్‌లో భర్త పనిచేస్తున్నారు. బ్లాక్‌లిస్టులో ఉన్నా జిల్లాలో పనిచేస్తున్న భార్యాభర్తల్లో ఎవరిని ఎక్కడికి పంపించాలో తెలియని పరిస్థితి. ఇద్దరిలో ఏ ఒక్కరికి కూడా అవకాశం లేకపోవడంతో ఏం చేస్తారనే తెలియకుండా పోయింది. ఎట్టకేలకు ఏడాది తర్వాత 14 మంది స్పౌజ్‌లకు బదిలీ చేసింది.

ఘనంగా వసంత పంచమి





విశ్వనాథ ఆలయంలో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు, అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకుడు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల విశ్వనాథ ఆలయంలో వసంత పంచమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి చిన్నారులకు అక్షరాభ్యాసం కార్యక్రమం చేపట్టారు. వసంత పంచమి విశిష్టతను అర్చకులు వివరించారు. స్థానిక రివిలేషన్ పాఠశాలలో ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌రావు ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ ఆలయ అర్చకుడు బాలక్రిష్ణ, ఆలయ ఈవో ముక్తా రవి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం

- బాసరలో వసంత పంచమి వేడుకలు
- భారీగా తరలివచ్చిన భక్తులు
- దర్శనానికి నాలుగు గంటలు.. అక్షరాభ్యాసానికి ఏడు గంటల సమయం
- క్యూలైన్లలో నిరీక్షించలేక చిన్నారులు, వృద్ధుల ఇబ్బంది



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి ఐకేరెడ్డి



ఆలయ ఆరుబయట క్యూ లైన్ లో భక్తులు



అక్షరాభ్యాసం చేయిస్తున్న పూజారులు

భైంసా/ముథోల్: చదువుల తల్లి సరస్వతీ క్షేత్రం బాసరలో వసంత పంచమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఏటా మాఘ శుద్ధ పంచమి రోజు అమ్మవారి జన్మదినం నిర్వహిస్తున్న సందర్భంగా వేలాదిగా భక్తులు తరలివచ్చారు. బుధవారం రాత్రే సుమారు 50 వేల మంది బాసరకు చేరుకున్నారు. దీంతో ఆలయ అధికారులు గురువారం తెల్లవారుజామున 2 గంటల నుంచే అమ్మవారికి పూజలు ప్రారంభించారు. భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు చేసి అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. ఆలయ ప్రవేశం వద్ద భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అతిథి గృహాల ముందు బారికేడ్లు ఏర్పాటు చేసి భక్తులను లోనికి అనుమతించారు. ఉదయం రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువచ్చారు. ఆలయ ఈవో విజయరామారావు, అధికారులు భాజాభజంత్రీలతో వారికి స్వాగతం పలికారు. అమ్మవా రిని దర్శించుకున్న మంత్రి, ఎమ్మెల్యేలు పట్టువస్త్రాలను సమర్పించారు.

ఆలయ అభివృద్ధికి కృషి...

అమ్మవారి దర్శనం అనంతరం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి క్యూలైన్లలో నిల్చున్న భక్తులతో మాట్లాడారు, పాలు, అరటిపండ్లు అందించారు. ఆలయ అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషిచేస్తామని తెలిపారు. వచ్చే వసంత పంచమి నాటికి మరి న్ని వసతి గృహాలు నిర్మిస్తామని తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులు ఇప్పటికే ప్రారంభించామని పేర్కొన్నారు.

భక్తులతో పోటెత్తిన బాసర..

వసంత పంచమి రోజు అమ్మవారిని దర్శించుకోవడంతోపాటు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించాలని రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి భక్తులు బాసరకు తరలివచ్చారు. దీంతో బాసర క్షేత్రం బుధవారం రాత్రి నుంచి గురువారం సాయంత్రం వరకు కిటకిటలాడింది. వేలాదిగా వచ్చిన భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించి అమ్మవారిని దర్శించుకున్నారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నుంచి 8 భజన మండళ్ల సభ్యులు పాదయాత్రగా బాసర వచ్చారు. అమ్మవారిని స్మరిస్తూ భజనలు చేస్తూ ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. చుట్టుపక్కల పల్లెల నుంచి వేలాది మంది భక్తులు పాదయాత్రగా వచ్చి బాసర అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు మంత్రి, ఎమ్మెల్యే రావడంతో అధికారులు సుమారు గంటపాటు దర్శనాలు నిలిపివేశారు. దీంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.

గంటల తరబడి నిరీక్షణ...

బాసరలో అక్షరాభ్యాసం చేయించాలన్న కోరికతో వచ్చిన భక్తులకు క్యూలైన్లలో ఇబ్బందులు ఎదురయ్యాయి. చిన్నారులను అక్షరశ్రీకార పూజలు జరిపించేందుకు నానమ్మలు, అమ్మమ్మలు, తాతయ్యలు బాసరకు వచ్చారు. వృద్ధులంతా ఎనిమిది గంటలపాటు నిరీక్షించారు. భక్తులు క్యూలైన్లలో ఒకరినొకరు తోసుకోవడంతో చిన్నారులు ఒత్తిడి తట్టుకోలేక ఏడ్చారు. అక్షరాభ్యాస మండపాల్లోనూ గంటల తరబడి నిరీక్షించాల్సి రావడంతో చాలామంది పిల్లలు ఏడుస్తూ కనిపించారు. మంచిర్యాల జిల్లా వేంపల్లికి చెందిన చిన్నారి క్యూలైన్లలో కిందపడడంతో తలకు గాయమైంది. అంబులెన్స్‌లో బాసర సీహెచ్‌సీకి తరలించి వైద్యసేవలందించారు. అమ్మవారి దర్శనానికి నాలుగు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో ఉన్నవారు వెనక్కి వెళ్లలేక, ముందుకు కదలలేక ఉన్నచోటే నిలబడి నీరసించిపోయారు. అత్యవసరాలకు కూడా వెళ్లలేని పరిస్థితి ఎదురైంది.

పలువురి సేవలు...

ఆలయంలో వేంకటేశ్వర సేవాసమితి సభ్యులు, బాసర యువకులు, ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు, అఖిల భారత పద్మశాలి సంఘ సభ్యులు, సరస్వతి అమ్మవారి భక్తులు, యువకులు స్వచ్ఛందంగా సేవలు అందించారు. పోలీసులు ప్రధాన ద్వారాల వద్ద బందోబస్తును ఏర్పాటు చేశారు. బాసర రైల్వేస్టేషన్, బస్టాండ్, స్నానఘట్టాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను పార్కింగ్ స్థలాలకు మళ్లించారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

వసంత పంచమి పురస్కరించుకుని బాసర సరస్వతి అమ్మవారిని దర్శించుకునేందుకు పలువురు ప్రముఖులు బాసరకు చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండె విఠల్, రాజ్యసభ సభ్యుడు దామోదర్‌రావు, ఈటల రాజేందర్ సతీమణి జమున, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీజేపీ నాయకులు రామారావ్ పటేల్ అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

రికార్డుస్థాయిలో అక్షరాభ్యాసాలు..

బాసర చరిత్రలో ఈ వసంతపంచమి రోజు రికార్డు స్థాయిలో అక్షరాభ్యాస పూజలు చేసినట్లు ఈవో విజయరామారావు తెలిపారు. కోవిడ్ కారణంగా రెండేళ్లుగా పిల్లలకు అక్రరాభ్యాస పూజలు వాయిదా వేసుకున్నవారు కూడా ఈ వసంత పంచమికి బాసరకు వచ్చారని తెలిపారు. దీంతో గురువారం ఒక్కరోజే 6,872 అక్షరాభ్యాస పూజలు జరిపించామని పేర్కొన్నారు. ఇందులో రూ.1000 అక్షరాభ్యాస పూజలు 4,046, రూ.150 అక్షరాభ్యాస పూజలు 2,826 జరిపించామని వివరించారు.

క్లుప్తంగా

గుండెపోటుతో మున్సిపల్ ఉద్యోగి మృతి


రాజేందర్ (ఫైల్)

నస్పూర్: నస్పూర్ మున్సిపాలిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న బొమ్మెన రాజేందర్ (48) గురువారం తెల్లవారు జామున లక్సెట్టిపేటలోని ఆయన స్వగృహంలో గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన జనవరి 2022లో ఖానాపూర్ మున్సిపాలిటీ నుంచి నస్పూర్‌కి బదిలీపై వచ్చి ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయనకు భార్య తిరుమల, ఇద్దరు కుమారులు ఉన్నారు. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్ మృతుడి ఇంటికి వెళ్లి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి అంత్యక్రియల నిమిత్తం రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట కౌన్సిలర్ బేర సత్యనారాయణ, ఆర్‌ఓ సతీశ్, బిల్‌కలెక్టర్ శీపతి సురేశ్‌కుమార్, ఇతర సిబ్బంది ఉన్నారు.

తాగిన మైకంలో బావిలో దూకిన యువకుడు


బావిలో దూకిన యువకుడు బాపు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని కొత్తగూడెం కాలనీలోని బావిలో కోటపల్లి మండలం అర్జునగుట్ట గ్రామానికి చెందిన పడాల బాపు అనే యువకుడు తాగిన మైకంలో దూకాడు. గమనించిన కాలనీ వాసులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందజేశారు. సిబ్బంది చేరుకుని బావిలో దూకిన యువకుడిని తాళ్ల సహాయంతో బయటికి తీశారు. బావిలో నీళ్లు లేకపోవడంతో ప్రాణప్రాయం తప్పింది. గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని రైతు ఆత్మహత్య

తిర్యాణి: ఉరేసుకుని రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని మాణిక్యపూర్ గ్రామంలో గురువారం వెలుగుచూసింది. ఎస్సై సీహెచ్ రమేష్ వివరాల ప్రకారం... మడావి లచ్చు(57) వ్యవసాయంతో పాటు పూజారిగా పనిచేస్తున్నాడు. కుటుంబ సభ్యులు లచ్చును పూజా కార్యక్రమాలకు వెళ్లవద్దని వారించారు. దీనికి తోడు అతడి వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ కాకపోడంతో మనస్తాపానికి గురై బుధవారం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు గాలింపు చర్యలు చేపట్టగా గురువారం పంట చేనులో ఉరేసుకుని విగతజీవిగా కనిపించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేవీకే శాస్త్రవేత్తలకు పురస్కారాలు


అవార్డు అందుకుంటున్న రాజేశ్వర్‌నాయక్

బెల్లంపల్లి: గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలకు పురస్కారాలు వరించాయి. గురువారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రం, ఉట్నూర్ ఐటీడీఏ కేంద్రంలోని వేడుకల్లో రైతాంగానికి వ్యవసాయ శాస్త్ర, సాంకేతిక రంగాలను పరిచయం చేసి సాగులో అధిక లాభాలు గడించేలా కృషి చేస్తున్న పలువురు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలకు అవార్డులు ప్రకటించారు. బెల్లంపల్లి కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎం. రాజేశ్వర్‌నాయక్, శాస్త్రవేత్తలు కోట శివకృష్ణ, నాగరాజు, తిరుపతిలను ఉత్తమ శాస్త్రవేత్తలుగా ఎంపిక చేసి ఆసిఫాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్, ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి అవార్డులు అందజేశారు.

ఘనంగా గణతంత్ర దినోత్సవం


జిల్లా గ్రామీణాభివృద్ధి కార్యాలయంలో..


ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ సులేమాన్


జిల్లా హెడ్‌పోస్టాఫీస్‌లో..


యూనియన్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శ్రీహరి


డీసీసీ కార్యాలయంలో..

పాతమంచిర్యాల: జిల్లాలో 74వ గణతంత్ర వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయంలో డీఆర్‌డీవో శేషాద్రి, తూనికలు, కొలతల శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్, జిల్లా ప్రధాన తపాలా కార్యాలయంలో హెడ్‌పోస్టుమాస్టర్ శ్రావణి, జిల్లా టెలికాం కార్యాలయంలో సబడివిజనల్ ఇంజినీర్ శ్రీధర్, మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ పెంట రాజయ్య, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో డీఎంహెచ్‌వో సుబ్బరాయుడు, నాన్‌గెజిడెట్ ఆఫీసర్స్ యూనియన్ కార్యాలయంలో తెలంగాణ నాన్ గెజిటెట్ ఆఫీసర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ సులేమాన్, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, అర్చన టెక్స్ చౌరస్తాలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదేలు, డిప్యూటీ సీఈవో ఆర్.లక్ష్మినారాయణ, మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు

డీసీపీ కార్యాలయంలో..

మంచిర్యాలక్రైం: డీసీపీ కార్యాలయంలో ఇన్‌చార్జి డీసీపీ అఖిల్ మహాజన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఏసీపీ కార్యాలయంలో, పోలీస్ స్టేషన్ అవరణలో సీఐ నారాయణ్‌నాయక్ జాతీయ జెండా ఎగురవేశారు.

జిల్లా కోర్టులో..

జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా జడ్జి బీ.సత్తయ్య జాతీయ జెండా ఎగురవేశారు. న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రావ్, సీనియర్ న్యాయవాదులు, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

- జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో, సర్కిల్ కార్యాలయంలో సీఐ నరేందర్ జాతీయ జెండా ఎగురవేశారు.
- జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో జిల్లా అటవీ శాఖ అధికారి శివ్ ఆశీష్ సింగ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్థానిక ఎఫ్‌డీఓ వినయ్‌కుమార్ సాహు, డిప్యూటీ రేంజ్ అధికారులు, ఎఫ్ఆర్‌ఓలు పాల్గొన్నారు.
- మంచిర్యాల పట్టణంలోని అగ్నిపమాపక శాఖ కార్యాలయంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికా రి అజయ్‌బాబు జాతీయ జెండా ఎగురవేశారు.

డీఐఈవో కార్యాలయంలో..

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలలో ప్రైవేట్, ప్రభుత్వ విద్యాసంస్థలు, కార్యాలయాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మంచిర్యాల డీఐఈవో కార్యాలయంలో డీఐఈవో శైలజ, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, డీఈవో కార్యాలయంలో విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసచారి, ఆర్టీసీ డిపో వద్ద డీఎం రవీంద్రనాథ్ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు, సెక్టోరియల్ అధికారులు సప్థర్‌అలీఖాన్, పద్మజా, చౌదరి, డీఎస్‌వో మధు బాబు పాల్గొన్నారు.

అలరించిన ఆటపాటలు

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల ఆటపాటలు అలరించాయి. పోటీల్లో ప్రతిభ చూపిన 151 మంది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం దుర్గయ్య, ఉపాధ్యాయులు యోగేశ్వర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఏరియాలో ఘనంగా వేడుకలు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణిలో గణతంత్ర వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. గనులు, యూనియన్ కార్యాలయాల వద్ద నాయకులు జాతీయ జెండాలను ఎగురవేశారు. ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలో ఏరియా జీఎం చింతల శ్రీనివాస్, సేవా సమితి అధ్యక్షురాలు లక్ష్మీశ్రీనివాస్ జెండాను ఆవిష్కరించారు. ఏరియాలోని సింగరేణి హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్ అండ్ పీసీ సిబ్బందితో గౌరవ వందనం స్వీకరించారు. ఉత్తమ ఉద్యోగులను శాలువాతో సన్మానించి బహుమతి అందజేశారు. పాఠశాల మైదానంలో విద్యార్థుల విన్యాసాలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి.


బీజేపీ ఆధ్వర్యంలో..


డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు


జీఎం కార్యాలయంలో..


విన్యాసాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

గిరిజనాభివృద్ధే ధ్యేయంగా ముందుకు..


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి


ప్రశంస పత్రం అందిస్తున్న పీవో

ఉట్నూర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ ఆధీనంలోని గిరిజన ప్రాంతాల సంపూర్ణ అభివృద్ధికి ఐటీడీఏ ద్వారా కృషి చేస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డి అన్నారు. 74వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని గురువారం ఐటీడీఏ ప్రాంగణంలో జెండా ఎగురవేసి మాట్లాడారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యాభివృద్ధి లక్ష్యంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 917 గిరిజన ప్రాథమిక పాఠశాలల్లో 12,945 మంది గిరిజన విద్యార్థులకు 681 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారని, అలాగే 133 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో 34,658 గిరిజన విద్యార్థులు పదో తరగతి వరకు చదువుకుంటున్నారని తెలిపారు. అలాగే ఐటీడీఏ పరిధిలోని 32 పీహెచ్‌సీలు, 186 ఉప ఆరోగ్యకేంద్రాలు, రెండు సామాజిక ఆరోగ్య కేంద్రాల ద్వారా గిరిజనులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. వనబంధు కల్యాణ యోజనా ద్వారా ఏజెన్సీలోని కెరమెరి, వాంకిడి, తిర్యాణి మండలాల్లో వైద్య, వైద్య, వ్యవసాయం, విద్యుత్, మంచినీటి సరఫరా, ఇతర మౌలిక వసతులు కల్పన కోసం పది కోట్లు విడుదల కాగా ఇప్పటికి రూ. 7.50 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గిరిజన సహకార సంస్థ ద్వారా 17 పెట్రోల్ పంపులు ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయగా ఆరు బంకులు ఏర్పాటు చేశామన్నారు. 97 మంది ఉత్తమ అధికారులకు, సిబ్బందికి ప్రశంస పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ కనక లక్కెరావ్, ఐటీడీఏ ఏవో రాంబాబు, ఏపీవో జనరల్ కనక భీం రావ్, అర్డీవో సురేశ్, డీటీటీడబ్ల్యూ దిలీప్‌కుమార్, ఈఈటీడబ్ల్యూ భీంరావ్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మనోహర్, జీసీడీవో చాయా, ఆర్సీవో గంగాధర్, జేడీఎమ్ నాగాభుషణం, ఐసీడీఎస్ సీడీపీవో శ్రావణి పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రగతిలో సింగరేణి


ఉత్తమ ఉద్యోగులను సన్మానిస్తున్న జీఎం దంపతులు


విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

- 100 మిలియన్ టన్నుల లక్ష్యంగా ముందుకు
- జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: దేశ, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిలో సింగరేణి కీలక పాత్ర పోషిస్తుందని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి తెలిపారు. గురువారం సింగరేణి ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా జీఎం కార్యాలయం వద్ద జీఎం జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రగతి మైదానంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కంపెనీ 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకొని ముందుకెళ్తుందని, 2029-30 నాటికి 100 మిలయన్ టన్నుల లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. నైనీ, వీకే 7 ఓసీపీ, జేకే 5 ఓసీపీ గనులతో బొగ్గు ఉత్పత్తి పెరుగనుందని తెలిపారు. కేవలం బొగ్గు ఉత్పత్తి మాత్రమే కాకుండా సింగరేణి విద్యుత్ ఉత్పత్తి రంగంలో కూడా దూసుకెళ్తుందని తెలిపారు. దీనికి ఇప్పటికే జైపూర్‌లో ఉన్న 1200 మెగా వాట్లా థర్మల్ కేంద్రం మరో 800 మెగా వాట్లకు పెంచి సూపర్‌క్రిటకల్ కేంద్రంగా మార్చుబోతున్నామన్నారు. దీనితో పాటు 300 మెగా వాట్ల సోలార్ ప్లాంట్‌ను స్థాపించామని, ముమ్ముందు దీన్ని 3000 మెగా వాట్లకు పెంచబోతున్నామన్నారు. కారుణ్య ఉద్యోగాలు, ఇతర రిక్రూట్‌మెంట్‌ల ద్వారా ఇటీవల సుమారు 16500 ఉద్యోగాలు కల్పించామన్నారు. అనంతరం ఉత్తమ ఉద్యోగులను జీఎం బీ సంజీవరెడ్డితో పాటు ఆయన సతీమణి సేవా అధ్యక్షురాలు రాధాకుమారిలను సన్మానించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కె.సురేందర్‌రెడ్డి, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదీర్, ఏరియా ఎస్ఓటూజీఎం త్యాగరాజు, డీజీఎంలు(పర్సనల్) గోవిందరాజు, అరవిందరావు, ఏజెంట్‌లు గోపాల్ సింగ్, ఏవీరెడ్డి పాల్గొన్నారు.

'వైద్యకళాశాల అందుబాటులో ఉండాలి'


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు

పాతమంచిర్యాల: ప్రభుత్వ వైద్యకళాశాల, జనరల్ ఆస్పత్రి ప్రజలకు అందుబాటులో ఉండే స్థలంలో నిర్మించాలని మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. గురువారం స్థానికంగా ఉన్న తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. సాయికుంటలోని ముంపు ప్రాంతంలో ఆస్పత్రి, మెడికల్ కళాశాల నిర్మాణం సరికాదని పేర్కొన్నారు. ఐటీఐ ఆవరణలో, గుడిపేటలో ప్రభుత్వ స్థలాలు ఉన్నా గోదావరి ముంపు ప్రాంతంలో నిర్మించాలనుకోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. గూడెం ఎత్తిపోతల పథకం ప్రజలకు ఉపయోగకరంగా లేదని, శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్టు నుంచి 42వ డిస్ట్రిబ్యూటరీ వరకు నీరందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చీట్ల సత్యనారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రావుల ఉప్పలయ్య, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ సంజీవ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రామగిరి బానేష్ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌ప్లాంటు కార్మికుల వినతి

పాతమంచిర్యాల: శాలీవాహన గ్రీన్ ఎనర్జీ పవర్ ప్లాంట్ కార్మికులు మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. శాలీవాహన గ్రీన్ ఎనర్జీ పవర్‌ప్లాంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కుంటాల శంకర్, ప్రధాన కార్యదర్శి నిమ్మరాజుల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఆనందరావు, కార్మికులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పరుగుపందెం పోటీలు


పోటీలో పాల్గొన్న యువకులు

రామకృష్ణాపూర్: బాల్కఫౌండేషన్ ఆధ్వర్యంలో బొక్కలగుట్ట గ్రామంలో గురువారం నిర్వహించిన పరుగుపందెం పోటీలు ఉత్సాహంగా సాగాయి. గ్రామంలోని రైతువేదిక నుంచి రుష్యముఖ పర్వతం చుట్టూ ఒకటిన్నర కిలీమీటర్ల మేర నిర్వహించిన పోటీలో యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మొదటి బహుమతి రూ.5016, రెండో బహుమతి రూ.2016, మూడో బహుమతి రూ.1016లు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేల్పుల రవి, రైతు బంధు మండల కో-ఆర్డినేటర్ బలికొండ కిషన్, వైస్ఎంపీపీ రాజ్‌కుమార్ సర్పంచ్ బొలిశెట్టి సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసపత్రం


ప్రశంసపత్రం అందుకుంటున్న ఎస్సై నరేష్

మేమనపల్లి/భీమారం: విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేసిన నీల్వాయి ఎస్సై గోపతి నరేష్‌ను గణతంత్ర దినోత్సవం సందర్భంగా డీసీపీ అఖిల్‌మహాజన్ ప్రశంసపత్రం అందజేసి సత్కరించారు. భీమారం పోలీసుస్టేషన్ కానిస్టేబుల్ పున్నంకు ప్రశంసపత్రం అందజేశారు. వీరిని ఏసీపీ నరేందర్, చెన్నూర్ రూరల్ సీఐ విద్యాసాగర్, భీమారం ఎస్సై సుధాకర్ అభినందించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సిర్పూర్(టి): పేకాటాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. మండలంలోని భూపాలపట్నం గ్రామ శివారులో పేకాటాడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్సై రమేశ్ ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించారు. నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారివద్ద నుంచి రూ.2,100 నగదును స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి తాగుతున్న ముగ్గురిపై కేసు


పట్టుకున్న గంజాయి

జన్నారం: మండల కేంద్రంలో గుట్టుగా గంజాయి సేవిస్తున్న వారిని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం రాత్రి గంజాయి సేవిస్తూ విక్రయిస్తున్నారే సమాచారం మేరకు మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదురుగా గల అడవి ప్రాంతంలో దాడులు చేయగా, గంజాయితో ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. అదే విధంగా కొందరు అనుమానితులను పట్టుకుని వారి నుంచి రక్తం, మూత్రం శ్యాంపుల్ తీసుకుని పరీక్షల నిమిత్తం పంపించారు. పట్టుబడిన కామెర నగేశ్, పవన్, దుర్గం సాయిలపై కేసు నమోదు చేయగా, మిగతా వారి శ్యాంపుల్స్ పాజిటివ్‌గా తేలితే వారిపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఇందులో దుర్గం సాయి అనే యువకుడు ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి తీసుకువస్తూ ఇక్కడ యువకులకు అమ్ముతున్నట్లు ఎస్సై తెలిపారు.

'బీఆర్‌ఎస్‌కు చరమ గీతం పాడండి'


యాత్ర ప్రారంభిస్తున్న వెడ్మ బొజ్జు

జన్నారం: రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి, ప్రజలపై మోయలేని భారం మోపుతూ, అక్రమాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో చరమ గీతం పాడాలని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పిలుపునిచ్చారు. గురువారం పీసీసీ పిలుపు మేరకు మండలంలోని రాంపూర్ గ్రామంలో హాత్ సే హాత్ జోడో యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని ఆరోపించారు. ప్రజల సమస్యలపై పట్టింపు లేకుండా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఫసీఉల్లా, కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు మహేశ్, మండల నాయకులు వసీం, నర్సింగరావు, పద్మరావు, నందునాయక్, భూమయ్య, విలాస్, హేమంత్‌చారి తదితరులు పాల్గొన్నారు.

నాగోబాకు పోటెత్తిన భక్తజనం


దర్శనానికి బారులు తీరిన భక్తులు


రంగులరాట్నాల వద్ద సందడి

ఇంద్రవెల్లి: నాగోబా జాతరకు గురువారం భక్తులు పోటెత్తారు. సెలవు రోజు కావడంతో ఉమ్మడి జిల్లాతో పాటు తెలంగాణ, మహారాష్ట్రల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గంటల తరబడి క్యూలో నిల్చోని నాగోబాను దర్శించుకున్నారు. నాగోబా జాతర పరిసర ప్రాంతాల భక్తులు ఎడ్ల బండ్లపై నాగోబా ఆలయానికి చేరుకున్నారు. నాగోబా ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు జాతరలో ఏర్పాటు చేసిన దుకాణ సముదాయల వద్ద ఇళ్లకు కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేశారు. ఈ నెల 28 వరకు అధికారికంగా నాగోబా జాతర కొనసాగనుంది.

రాష్ట్ర జట్టు హ్యాండ్‌బాల్ కోచ్‌గా అరవింద్


అరవింద్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో గిరిజన బాలికల పాఠశాలలో హ్యాండ్‌బాల్ కోచ్‌గా పనిచేస్తున్న అరవింద్ జాతీయ స్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలకు రాష్ట్ర జట్టుకు కోచ్‌గా ఎంపికైనట్లు గురువారం ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ అధ్యక్షుడు శ్యాంసుదర్‌రావు తెలిపారు. ఈ నెల 26 నుంచి 30 వరకు తమిళనాడు రాష్ట్రంలోని తిరుచిరపల్లిలో జరిగే 44వ జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కోచ్‌గా పనిచేస్తారని తెలిపారు.